క్లుప్తంగా

డ్రంకెన్ డ్రైవ్ కేసులో పది మందికి జరిమానా

ఇంద్రవెల్లి: డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఇటీవల పట్టుబడిన పది మందికి జరిమానా విధిస్తూ ఉట్నూర్ కోర్టు మెజిస్ట్రేట్ బానోతు ఉస్సేన్ నాయక్ మంగళవారం తీర్పు వెలువరించారని ఎస్సై సునీల్ తెలిపారు. మండల కేంద్రంలో ఇటీవల డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో భాగంగా 10 మంది వాహనదారులు పట్టుబడినట్లు పేర్కొన్నారు. ఉట్నూర్ కోర్టు మెజిస్ట్రేట్ ఎదుట వారిని హాజరుపర్చగా ఒక్కొక్కరికి రూ.10 వేల జరిమానా విధించినట్లు తెలిపారు. అదేవిధంగా పోలీసు నిబంధనలు ఉల్లంఘించిన నలుగురిపై ఈ–పెట్టి కేసు నమోదు చేయగా రూ.200 చొప్పున మొత్తం రూ.800 జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. మద్యం తాగి వాహనం నడిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంతకుముందు వాహనదారులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి రూ.లక్ష విరాళం



నగదు అందజేస్తున్న మహేందర్

ఆదిలాబాద్: పట్టణంలోని సరస్వతినగర్‌కు చెందిన బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి రాళ్లబడి మహేందర్ తన జన్మదినాన్ని పురస్కరించుకుని మంగళవారం దుర్గానగర్ కాలనీ పరిధిలోని శంకర్ గుట్టలోని ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం ప్రకటించారు. ఆలయాన్ని సందర్శించి కమిటీ సభ్యులకు నగదును అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రమాగౌడ్, సంజీవ్, ఎల్చాల మల్లేశ్, పిట్ల ఓం ప్రకాశ్, సుదర్శన్, రమేశ్, అభిలాష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు



మట్లాడుతున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

తాంసి: విద్యార్థులకు చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు ఉందని ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కప్పర్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు మంగళవారం నిర్వహించిన వీడ్కోలు సమావేశానికి డీఎస్పీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షలంటే విద్యార్థులు భయపడొద్దన్నారు. కష్టపడి చదివి పరీక్ష రాయాలన్నారు. రూరల్ సీఐ ఫణీందర్, ఎస్సై శివరాం, ఎంపీటీసీ సంతోష్, మాజీ సర్పంచ్ సదానంద్, మార్కెట్‌డైరెక్టర్ మహేందర్, హెచ్‌ఎం కిష్టన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

ఆదిలాబాద్‌టౌన్: మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని జిల్లా సంక్షేమ అధికారి సబితా అన్నారు. జిల్లాకేంద్రంలోని తిరుమల తిరుపతి కల్యాణ మండపంలో జనశిక్షణ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదగాలని అన్నారు. వృత్తి శిక్షణను నేర్చుకొని కుటుంబానికి ఆసరగా ఉండాలని సూచించారు. అనంతరం మహిళలు సాంస్కృతిక కార్యక్రమాలు, దేశభక్తి గీతాలు ఆలపించారు. కాగా మహిళల హక్కుల పరిరక్షణ పట్ల ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ అధికారి పద్మభూషణ్ రాజు, లీడ్‌బ్యాంక్ మేనేజర్ ప్రసాద్, స్టెప్ సీఈఓ వెంకటేశ్వర్లు, సెడ్స్ ఎన్‌జీఓ డైరెక్టర్ సురేందర్, జనశిక్షణ సంస్థ డైరెక్టర్ శ్యామల, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన కుష్ఠు వ్యాధిగ్రస్తుల గుర్తింపు సర్వే

ఇచ్చోడ: కుష్ఠు వ్యాధిగ్రస్తుల గుర్తింపు సర్వే మండలంలో కొనసాగుతోంది. మండల కేంద్రంలోని పలు కాలనీలో మంగళవారం ఇచ్చోడ పీహెచ్‌సీ వైద్యాధికారి సాగర్ పాల్గొని మాట్లాడారు. జాతీయ కుష్ఠు నిర్మూలనలో భాగంగా ఈనెల 11 నుంచి 24 వరకు కుష్ఠువ్యాధిగ్రస్తుల గుర్తింపు సర్వే చేపడుతున్నట్లు తెలిపారు. ఈ వ్యాధి బారినపడిన వారు తమ బృందం సభ్యులు కానీ ఆశవర్కర్లకు సమాచారం ఇవ్వాలన్నారు. పీహెచ్‌ఎన్ రాజుబాయి, ఏఎన్‌ఎం సుధ, హెల్త్‌అసిస్టెంట్ రాజ్‌కిరణ్, ఆశవర్కర్లు సునీత, లక్ష్మి పాల్గొన్నారు.

నిరుపయోగంగా నీటితొట్లు

- రూ. లక్షల నిధులు వృథా
- నిర్వహణ లేక శిథిలావస్థలో కొన్ని..
- దాహం కోసం అల్లాడుతున్న మూగజీవాలు

జిల్లాలో వివరాలు..

ఆవులు:	3,11,182
గేదెలు:	48,650
మేకలు:	1,86,469
గొర్రెలు:	1,53,214



నేరడిగొండ మండలం కుప్టి గ్రామంలోని నిరుపయోగంగా మారిన నీటి తొట్లు

నేరడిగొండ: జిల్లాలో మూగజీవాల దాహార్తి తీర్చేందుకు నిర్మించిన నీటితొట్లు వృథాగా మారాయి. చాలా గ్రామాల్లో నిర్మించిన తొట్లలో నీటి సదుపాయం లేక నిరుపయోగంగా మారాయి. మరికొన్ని నిర్వహణ లేక శిథిలావస్థకు చేరాయి. వేసవికాలం కావడంతో పాటు భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో మూగజీవాల దాహం తీరడం కష్టంగా మారుతోంది. కొన్నేళ్ల క్రితం నిర్మించిన తొట్లు చాలా గ్రామాల్లో నీటి వసతి లేక వృథాగా మారాయి.

పలు గ్రామాల్లో పరిస్థితి..

ఉపాధిహామీ పథకం ద్వారా గ్రామాల్లో నీటితొట్లు నిర్మిస్తున్నా వాటి నిర్వహణ చూసేవారు లేక నిరుపయోగంగా మారాయి. రూ.లక్షల్లో వెచ్చించినా ఫలితం కానరాలేదు. ఎనిమిదేళ్ల క్రితం నెలకొన్న తీవ్ర కరవు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఉపాధిహామీ పథకం ద్వారా నిధులు కేటాయించి నిర్మాణాలు చేపట్టారు. ఒక్కో నిర్మాణానికి రూ.21 వేలు కేటాయించి పనులు పూర్తి చేశారు. నీటి వసతి లేకున్నా ఎక్కడపడితే అక్కడ నిర్మించడంతో నిరుపయోగంగా మారాయి. వేసవిలో కొన్ని గ్రామాల్లో పశువులకు నీరు, మేత లేక ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు.

నీటి వసతి కల్పిస్తే మేలు

చాలాచోట్ల నిర్మాణాలు అందుబాటులో ఉంచి, నీటి వసతి కల్పించినప్పుడే మూగజీవాల దాహార్తి తీరనుంది. చెరువులు, కుంటల్లో నీరు క్రమంగా తగ్గుముఖం పడుతున్నాయి. వేసవిలో మూగజీవాల దాహార్తి తీర్చేలా నీటితొట్లకు బోరు ద్వారా పైపులైన్లు ఏర్పాటు చేసి నీటి సౌకర్యం కల్పించాలి. ట్యాంకర్ల ద్వారా తొట్లలో నీటిని నింపితే మూగజీవాలకు ఉపయుక్తంగా ఉంటుంది. అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టి తొట్లలో నీటి వసతి కల్పించేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

శనగ కొనుగోళ్లు ప్రారంభం



తాంసి: ప్రారంభిస్తున్న పీఏసీఎస్ వైస్ చైర్మన్ ధనుంజయ్

బోథ్: బోథ్ మార్కెట్ యార్డు పరిధిలో మంగళవారం శనగ కొనుగోళ్లను మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, డీఎం ప్రవీణ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు పండించిన శనగ పంటను మార్కెట్ యార్డుకు తీసుకువచ్చి మద్దతుధర పొందాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సంధ్యారాణి, జిల్లా కోఆప్షన్ సభ్యుడు తహెర్‌బిన్ సలాం, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వసంతరావు, సహకార సంఘం చైర్మన్ ప్రశాంత్, మార్కెట్ కమిటీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి మనోహర్, సీఈవోలు భూషణ్, గోలి స్వామి, ఎంపీటీసీ మహేందర్, మాజీ సర్పంచ్ సురేందర్ యాదవ్, సహకార సంఘం డైరెక్టర్ రాజు యాదవ్, సహకార సంఘం సభ్యులు పాల్గొన్నారు.

తాంసి: మండల కేంద్రంలో సబ్ మార్కెట్‌యార్డులో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన శనగల కొనుగోలు కేంద్రాన్ని తాంసి పీఏసీఎస్ వైస్ చైర్మన్ ధనుంజయ్ ప్రారంభించారు. అనంతరం పంటను తీసుకువచ్చిన రైతును సన్మానించారు. కార్యక్రమంలో డైరెక్టర్ బుజ్జన్న, ఏఈవో యోగిరాజ్, సీఈవోలు దత్తు, రాంరెడ్డి, నాయకులు కృష్ణ, సతీశ్, దేవన్న ఉన్నారు.

ఘనంగా 'లైట్నింగ్'



ఎదులాపురం: జిల్లాకేంద్రంలోని రిమ్స్ నర్సింగ్ కళాశాలలో లైట్నింగ్ సర్మని కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. మొదటి సంవత్సరం విద్యార్థులు వార్డుల్లో బాధితులకు సేవలందించడానికి వెళ్లేప్పుడు కొవ్వొత్తులు వెలిగించి ప్రతిజ్ఞ చేయించడం సంప్రదాయంగా వస్తోంది. ప్రిన్సిపాల్ అనిత, అధ్యాపకులు లక్ష్మి, నర్సింగ్ సూపరింటెండెంట్ వనజ పాల్గొన్నారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధపెట్టాలి



ఆదిలాబాద్‌టౌన్: ఆహార పదార్థాలు ప్రదర్శిస్తున్న దృశ్యం

ఆదిలాబాద్‌టౌన్: గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధపెట్టాలని ఐసీడీఎస్ అర్బన్ సీడీపీఓ వనజ అన్నారు. జిల్లాకేంద్రంలోని సుందరయ్యనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ఎర్లీ చైల్డ్ కేర్ ఎడ్యుకేషన్ డేలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 23 వరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పక్షోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గర్భిణులు పోషకాహారం తీసుకోవడంతో పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. ఆకుకూరలు, కూరగాయలు, ప్రొటీన్లు, విటమిన్లు, పప్పుదినుసులు తీసుకోవాలని సూచించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో ఆకుకూరలు, వివిధ పోషక విలువలకు సంబంధించిన ఆహార పదార్థాలు, ధాన్యాల ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షర్మా, అంగన్‌వాడీ కార్యకర్త రాధ తదితరులు పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్: పిల్లలకు పోషకాహారం అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మ అన్నారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న ఈసీసీఈ కార్యక్రమాన్ని పరిశీలించారు. పిల్లలకు పౌష్టికాహారంతో పాటు ఆటలను నిర్వహించాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు హేమలత, రాధ పాల్గొన్నారు.

బోథ్: సొనాల–1వ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణపక్షోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వివిధ రకాల చిరుధాన్యాలు, పోషకాహార పదార్థాలపై సొనాల సెక్టార్ సూపర్‌వైజర్ విమల అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ టీచర్లు, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

ఇచ్చోడ: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈనెల 9 నుంచి 23 వరకు నిర్వహించే పోషణ పక్షోత్సవాలను విజయవంతం చేయాలని సూపర్‌వైజర్ ఉమారాణి కోరారు. బోరిగామ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోషణ పక్షోత్సవాల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. 15 రోజుల పాటు పక్షోత్సవం కార్యక్రమం ద్వారా పిల్లలకు తల్లులకు అవగాహన కల్పిస్తామన్నారు. మాజీ సర్పంచ్ అరుంధతి, అంగన్‌వాడీ కార్యకర్త పాల్గొన్నారు.

పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్



జైనథ్: మాట్లాడుతున్న రేఖానాయక్

జైనథ్: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే, పార్టీ నాయకురాలు రేఖానాయక్ అన్నారు. మండల కేంద్రంలోని లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో మంగళవారం కార్యకర్తలు, నాయకులతో కలిసి పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆమె మాట్లాడారు. బీఆర్‌ఎస్‌లో స్వేచ్ఛ ఉండేది కాదన్నారు. గత ఎన్నికల్లో తనకు బీఆర్‌ఎస్ టికెట్ రాకపోవడంతోనే సొంతగూటికి చేరే అవకాశం దక్కిందన్నారు. వెడ్మ బొజ్జుకు ఖానాపూర్ టికెట్ ఖాయమైనప్పుడే, తనకు ఎంపీ టికెట్ ఇస్తామని అధిష్ఠానం హామీ ఇచ్చిందని అన్నారు. కార్యకర్తలు సహకరిస్తే ఆదిలాబాద్ ఎంపీగా గెలిచి చూపిస్తానన్నారు. సంతోష్, సుదర్శన్, మనోజ్, విఠల్ ఉన్నారు.

కైలాస్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపునకు కార్యకర్తలంతా కలిసికట్టుగా బాధ్యతతో పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని ప్రజాసేవభవన్‌లో మంగళవారం నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎంపీ టికెట్ కోసం పార్టీలోని చాలామంది అభ్యర్థులు పోటీ పడుతున్నారని, అనుభవం ఉన్న నాయకులు బరిలో ఉంటేనే గెలిచేందుకు అవకాశం ఉంటుందన్నారు. గతంలో జెడ్పీటీసీగా, ఎమ్మెల్యేగా పనిచేసిన అనుభవం తనకుందని, అధిష్ఠానం తనకే టికెట్ కేటాయిస్తుందనే నమ్మకముందన్నారు. టికెట్ ఎవరికి కేటాయించినా ఆదిలాబాద్ పార్లమెంట్ గడ్డ మీద కాంగ్రెస్ జెండా ఎగురవేసేందుకు కార్యకర్తలు పనిచేయాలన్నారు. నాయకులు సంతోష్, నర్సింగ్, విఠల్, షకీల్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలిచ్చే వరకు పోరాటం

- తుడుందెబ్బ రాష్ట్ర నాయకుడు గోడం గణేశ్

ఆదిలాబాద్‌రూరల్: మావల మండలం బట్టిసావర్‌గాం శివారు ప్రాంతంలో గల సర్వే నంబర్ 72/22, 72/23లో నివాసముంటున్న ఆదివాసీల ఇళ్లస్థలాలకు పట్టాలు, నీటి, విద్యుత్, రోడ్డు సౌకర్యం కల్పించేవరకు పోరాటం చేస్తామని ఆదివాసీ హక్కుల పోరాటసమితి (తుడుందెబ్బ) రాష్ట్ర నాయకుడు గోడం గణేశ్ పేర్కొన్నారు. మంగళవారం కుమరం భీంగూడలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇదే విషయమై కుమరం భీంగూడలో ఉంటున్న ఆదివాసీల కోసం పోరాటాలు చేస్తున్నామని తెలిపారు. అయినా ఉన్నతాధికారులు స్పందించలేదన్నారు. బుధవారం కుమరం భీంగూడ నుంచి నల్లగుడ్డలు కట్టుకొని పాదయాత్రగా కలెక్టరేట్‌కు చేరుకుని మౌన పోరాటం చేస్తామన్నారు. తుడుందెబ్బ నాయకులు పాల్గొన్నారు.

నీటి సమస్య లేకుండా చర్యలు చేపడతాం

నేరడిగొండ: వేసవిలో నీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపడతామని ఎంపీడీవో రాజ్‌వీర్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎన్ఆర్ ఈజీఎస్, పంచాయతీ ప్రత్యేక అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం రోజురోజుకు ఎండలు పెరిగిపోతున్న దృష్ట్యా గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చూస్తున్నామన్నారు. ఇదిలా ఉండగా ఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వారా అడిగిన ప్రతిఒక్కరికి ఉపాధి పనులు కల్పించాలని సూచించారు. సమావేశంలో ఎంపీవో లక్ష్మణ్, ఈజీఎస్ ఏపీవో వసంత్‌రావు, జీపీ ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు, టీఏ, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

బోథ్: వేసవిలో నీటి ఎద్దడి లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మండల ప్రత్యేక అధికారి డీఎస్‌వో కిరణ్ పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రమేశ్, ఎంపీవో మహేందర్‌రెడ్డితో కలిసి కార్యదర్శులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని బోరు బావులకు మరమ్మతు చేయాలన్నారు. మిషన్ భగీరథ తాగునీటి సరఫరాపై దృష్టి సారించాలన్నారు. ఎలాంటి లీకేజీలు లేకుండా చూడాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ కల్యాణ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన



బోథ్: వీసీలో సలహాలు వింటున్న రైతులు



ఇచ్చోడ: వీసీలో పాల్గొన్న అధికారులు

ఇచ్చోడ: స్థానిక రైతు వేదికలో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతు నేస్తం కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 10 గంటలకు నిర్వహించిన కార్యక్రమంలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి శాస్త్రవేత్తలు వివిధ అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. మామిడిలో పిందె రాలడం వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలను గురించి శాస్త్రవేత్త డాక్టర్ సుచిత్ర వివరించారు. అధిక ఉష్ణోగ్రత ప్రభావం వల్ల పంటల్లో జరిగే నష్టాలు, వాటి నివారణ చర్యల గురించి అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ జగిత్యాల డాక్టర్ శ్రీనివాస్ వివరించారు. సేంద్రియ వ్యవసాయ పద్ధతులపై డాక్టర్ ప్రగతి కుమార్ తెలియజేశారు. రైతుల సందేహాలను నివృతి చేశారు. జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, ఏడీఏ రాంకిషన్, ఏవో జాదవ్ కైలాస్, ఏఈవోలు పాల్గొన్నారు.

బోథ్: స్థానిక రైతువేదికలో రైతు నేస్తం కార్యక్రమంలో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా మంగళవారం రైతుల సందేహాలను ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి శాస్త్రవేత్తలు నివృత్తి చేశారు. ఏడీఏ శ్రీధర్ స్వామి, హార్టికల్చర్ అధికారి మహేశ్, ఆయిల్‌పామ్ మేనేజర్ రామ్మోహన్‌రావు, ఏఈవోలు కృష్ణ, శ్యాంసుందర్‌రెడ్డి, శ్యామ్, అర్జుహి, రైతులు పాల్గొన్నారు.

పోడు భూముల్లో ఉపాధి పనులు చేపట్టాలి



ఏపీడీకి వినతిపత్రం ఇస్తున్న గిరిజన రైతులు

తాంసి: ప్రభుత్వం పట్టాలు అందించిన పోడు భూముల్లో ఉపాధి పనులు చేపట్టేలా చూడాలని కొలాం, గిరిజనులు కోరారు. భీంపూర్ మండలంలోని అర్లి(టి), శాంతినగర్, మందపల్లి గ్రామాలకు చెందిన గిరిజనులు మంగళవారం భీంపూర్‌లో డీఆర్‌డీఏ ఏపీడీ కుటుంబరావుకు, ఎంపీడీవోకు ఆయన కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఆర్ఓఎఫ్ఆర్ కింద పట్టాలు అందజేసిన భూముల్లో చేపట్టే ఉపాధి పనులను అటవీ అధికారులు అడ్డుకుంటున్నారని తెలిపారు. కొలాం సేవా సంఘం ప్రధాన కార్యదర్శి టేకం దిలీప్, గిరిజన రైతులు ఆత్రం నారాయణ, దాదారావు, రామన్న, వెంకటి తదితరులు ఉన్నారు.

ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోవాలి

తాంసి: ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఏ ఏపీడీ కుటుంబరావు కోరారు. కలెక్టర్ ఆదేశాలతో తాంసి మండలంలోని గోట్కూరి గ్రామంలో ఉపాధి కూలీలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఏపీడీ, ఎంపీడీవో మోహన్‌రెడ్డి గ్రామస్తులతో మాట్లాడి పనులు కల్పిస్తామని, పనులకు వెళ్లాలని కూలీలకు సూచించారు. పనులను ప్రత్యేకాధికారి పర్యవేక్షించాలన్నారు. సమావేశంలో ఏపీవో విజయ, పంచాయతీ కార్యదర్శి సౌజన్య, గ్రామపెద్దలు దేవిదాస్, రోహిత్, రమేశ్, భగువాండ్లు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

పరీక్ష సామగ్రి అందజేత

బేల: మండలంలోని సిర్సన్న గ్రామంలో జెడ్పీ ఉన్నత పాఠశాలలో 47 మంది టెన్త్ విద్యార్థులకు మంగళవారం స్థానిక రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పరీక్ష సామగ్రిని అందజేశారు. హెచ్‌ఎం మహాలక్ష్మి, మాజీ సర్పంచ్ భూమన్న, రెడ్డి సంఘం అధ్యక్షుడు క్యాతం సురేశ్‌రెడ్డి, నాయకులు కృష్ణారెడ్డి, భూమారెడ్డి, సీఆర్పీ వెంకన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని కాంగ్రెస్ సీనియర్ నాయకులు అబ్దుల్ మాబూద్ ఖాన్ అన్నారు. ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ఆదేశాలతో మండల కేంద్రంలోని జెడ్పీ ఉర్దూ పాఠశాలలో 30 మంది విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందించినట్లు తెలిపారు. హెచ్‌ఎం అరుణ, అహ్మదుల్ల, అఖిల్, మతీన్, సరస్వతి ఉన్నారు.

రేపు హనుమాన్ దీక్షల స్వీకరణ ప్రారంభం

బేల: మండలంలోని సిర్సన్న శివారులోని సింగాపూర్ హనుమాన్ ఆలయంలో గురువారం 41 రోజుల దీక్షల స్వీకరణ కార్యక్రమం ప్రారంభం ఉంటుందని పూజారి దినేష్ చౌదరి పేర్కొన్నారు. ఈనెల 14న 41రోజుల మండల దీక్ష, వచ్చే నెలలో 3న 21రోజుల అర్ధమండల దీక్ష, 13న 11రోజుల దీక్షల స్వీకరణ ఉంటుందని తెలిపారు. వచ్చే నెల 23న హనుమాన్ జయంతి రోజు ఈ దీక్షల మాల విరమణ ఉంటుందని తెలిపారు.

నోటు పుస్తకాల పంపిణీ

జైనథ్: . గణిత మేధావి, ఎస్‌సీఆర్టీ పాఠ్య పుస్తకాల రచయిత, దివంగత గణిత ఉపాధ్యాయుడు ధర్మేందర్ సింగ్ జ్ఞాపకార్థంగా గిమ్మ జెడ్పీ ఉన్నత పాఠశాలలో కాల్స ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో టెన్త్ విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు ఉచితంగా అందజేశారు. హెచ్‌ఎం పద్మజ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సంకల్ప సభకు తరలిన నాయకులు

నేరడిగొండ/బోథ్: హైదరాబాద్‌లోని ఎల్బీనగర్‌లో మంగళవారం నిర్వహించిన బీజేపీ సంకల్ప సభకు బీజేపీ నాయకులు తరలివెళ్లారు. ప్రత్యేక వాహనంలో బయల్దేరి వెళ్లారు. సుభాష్ సూర్య, రవిందర్, శ్రీకాంత్ రెడ్డి, రవితేజ తదతరులు ఉన్నారు.

15 నుంచి క్రికెట్ పోటీలు

బోథ్: మండలంలోని కనుగుట్ట గ్రామంలో ఈనెల 15 నుంచి వివేకానంద యూత్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్లు సభ్యులు ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల జట్టు ఈ నెల 15లోగా రూ.1500 ఎంట్రీ ఫీజుతో తమ జట్లను నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9573233735, 7989803409 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

నేడు శనగ కొనుగోళ్లు ప్రారంభం

బేల: మండలకేంద్రంలోని సబ్ మార్కెట్‌యార్డులో బుధవారం శనగ కొనుగోళ్లు ప్రారంభించనున్నట్లు జైనథ్ మార్కెట్ కమిటీ కార్యదర్శి మధుకర్ ఓ ప్రకటనలో తెలిపారు.

నేడు విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

తాంసి: మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో బుధవారం విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు ఏఈ మనోజ్ కుమార్ తెలిపారు. తాంసి, భీంపూర్, తలమడుగు మండలాల్లోని వినియోగదారులు తమ సమస్యలను తెలిపి పరిష్కరించుకోవాలని సూచించారు.

వేధిస్తే షీ టీమ్‌ను సంప్రదించాలి

ఆదిలాబాద్‌రూరల్: ఆకతాయిలు వేధింపులు, ఇబ్బందులకు గురిచేస్తే షీ టీమ్‌కు సంప్రదించాలని షీ టీమ్ అధికారులు సుశీల, సత్యమోహన్ అన్నారు. మండలంలోని చాందా (టి) శివారు ప్రాంతంలో గల మైనార్టీ పాఠశాల విద్యార్థులకు మంగళవారం చట్టాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాలపై అవగాహన ఉండాలన్నారు. పోకిరీలు బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన, మాట్లాడిన, ఇతర ఇబ్బందులకు గురి చేసిన వెంటనే షీ టీమ్ నంబర్ 87126 59953కి ఫోన్ చేయాలన్నారు. హెచ్‌ఎం, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

తాంసి: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని గోపాలకృష్ణ మఠాధిపతి శ్రీ యోగానంద సరస్వతి అన్నారు. మండలంలోని వామన్‌నగర్ గ్రామంలో మంగళవారం శ్రీ సంత్ సద్గురు నారాయణబాబా 21వ విశ్వ కల్యాణ అఖండ హరినామా మహాయజ్ఞం నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. అనంతరం బాబా ఆలయంలో పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు పొచ్చన్న, సభ్యులు జాదవ్ కిషన్, నాగారెడ్డి, భూమారెడ్డి, గంగన్న, నారాయణ, భక్తులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

ఇచ్చోడ: ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని కోకస్‌మన్నూర్ కాంప్లెక్స్ హెచ్‌ఎం విజయలక్ష్మి అన్నారు. మండలంలోని ధర్మంపూరి, చించోలి, నవేగావ్, గేర్జం, జామిడి ప్రాథమిక పాఠశాలలను మంగళవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డీఎస్సీ, ఎఫ్ఆర్ఎస్ ఉన్నందున విద్యార్థులు అటెండెన్స్ రోజువారీగా నమోదు చేయాలన్నారు. రూం టూ రీడ్ కోఆర్డినేటర్ ఉదయ శ్రీ, సీఆర్పీ శ్యాంసుందర్ తదితరులు ఉన్నారు.

ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటుపై హర్షం

ఎదులాపురం: రెడ్డి కార్పొరేషన్, ఈబీసీల కోసం ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు నిర్ణయంపై రెడ్డి ఐక్య వేదిక రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి క్యాతం శివప్రసాద్‌రెడ్డి ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తం కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితోపాటు మంత్రి మండలికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

విజేతలకు బహుమతులు

ఎదులాపురం: తెలంగాణ ఆదివాసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన ఎస్సెస్సీ టాలెంట్ టెస్ట్ విజేతలకు మంగళవారం బహుమతులు ప్రదానం చేశారు. ఈ టీఏవీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణు మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధం చేసేందుకు ఈ టాలెంట్ టెస్ట్ నిర్వహించినట్లు తెలిపారు. ఏటీడీవో నిహారిక, సంఘం జిల్లా నాయకులు మెస్రం మహేశ్, హెచ్‌ఎం తదితరులు పాల్గొన్నారు.

ఫ్రెండ్స్ క్లబ్ భవనానికి భూమిపూజ

బోథ్: మండల కేంద్రంలోని మంగళవారం ఫ్రెండ్స్ క్లబ్ నూతన భవన నిర్మాణానికి జెడ్పీటీసీ సంధ్యారాణి భూమిపూజ నిర్వహించారు. జెడ్పీ నిధుల నుంచి రూ.10 లక్షలతో భవన నిర్మాణాన్ని చేపడుతున్నట్లు ఆమె తెలిపారు. జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు తాహెర్ బిన్ సలాం, మాజీ సర్పంచ్ సురేందర్ యాదవ్, బీఆర్ఎస్ మండల కన్వీనర్ నారాయణరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శులు ఎలుక రాజు, రాజు, రఫీ, ఫ్రెండ్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి రమేశ్‌బాబు, కార్యవర్గ సభ్యులు రవీందర్ ప్రసాద్, అప్క కిషన్ పాల్గొన్నారు.

ఘనంగా రామకృష్ణ పరమహంస జయంతి

ఆదిలాబాద్: పట్టణంలో శ్రీరామకృష్ణ పరమహంస 189వ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. సంజయ్‌నగర్ రామకృష్ణ మార్గ్‌లో గల ధ్యాన మందిరంలో ఆయ చిత్రపటం వద్ద మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ ప్రత్యేక పూజలు చేశారు. భూమన్న, లెనిన్, లక్ష్మయ్య, బండారి సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి ఆదివాసీ సేన రాష్ట్ర అధ్యక్షుడు



కండువా కప్పుతున్న మంత్రి సీతక్క

కైలాస్‌నగర్: ఆదివాసీ సేన రాష్ట్ర అధ్యక్షుడు, పట్టణానికి చెందిన కోవ దౌలత్‌రావు మంగళవారం కాంగ్రెస్‌లో చేరారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ఆధ్వర్యంలో జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్కను కలిసిన ఆయన హైదరాబాద్ ప్రజాభవన్‌లో ఆ పార్టీలో చేరారు. ఎల్ఐసీ ఉద్యోగానికి రాజీనామా చేసి పార్టీలో చేరిన ఆయనకు సీతక్క కాంగ్రెస్ కండువా కప్పి స్వాగతించారు. ప్రజా సేవ చేయాలనే ఉద్దేశంతో తన ఉద్యోగానికి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరినట్లు ఆయన తెలిపారు.